సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 3 । ఏప్రిల్ । 2023



వైభవంగా శోభాయాత్ర
హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులో చేపట్టిన శ్రీహనుమ భక్త శోభాయాత్ర వైభవంగా సాగింది. 8లో




బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	- రూ.61,360
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1గ్రా)	- రూ.5,481
3 శాతం జీఎస్టీతో	- రూ.5,645
నవర (8 గ్రా)	- రూ.45,160

వాతావరణం
గరిష్టం/కనిష్టం 35.7 /27.0

ఆదివారం గాలిలో 73 శాతం తేమ ఉంది. సోమవారం అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



చుక్కల భూములకు శాశ్వత హక్కులు

జిల్లాలో 43 వేల ఎకరాలకు క్లియరెన్స్ ఇచ్చిన ప్రభుత్వం

చుక్కల భూముల సమస్య.. ఇది అనేక సంవత్సరాలుగా ఉంది. సంబంధిత రైతుల ఇబ్బందులను గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. వారసత్వంగా వచ్చిన భూములు తమ అనుభవంలోనే ఉన్నప్పటికీ క్రయ, విక్రయ హక్కుల్లేక ఏళ్లుగా యజమానులు కుమిలిపోతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. సాగు, అనుభవదారులకు ఒక్క జీఓతో సర్వహక్కులు కల్పించింది. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఈ సమస్యకు పరిష్కారం చూపారు.

- అనేక సంవత్సరాలుగా నిషేధిత జాబితాలో..
- జీఓ నంబర్ 163 విడుదల
- 23 వేల మందికి లబ్ధి
- మంత్రి కాకాణి చొరవకు కృతజ్ఞతలు తెలిపిన రైతులు
- సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


నెల్లూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మంత్రి కాకాణి సమక్షంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పుష్పాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు తదితరులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న చుక్కల భూముల సమస్యకు పరిష్కారం చూపడంలో గత ప్రభుత్వాలు చేతులెత్తేశాయి. అప్పటి నుంచి సాగుదారులకు హక్కుల్లేక తల్లడిల్లుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో భూములు అమ్ముకోవాల్సి వస్తే దానిని నిషేధిత జాబితాలో నుంచి తొలగించేందుకు చాలా తతంగం ఉండేది. గతంలో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేకపోవడంతో ఎంతోమంది ఆర్థికంగా చితికిపోయారు. అత్యవసర సమయాల్లో భూములను విక్రయించుకోలేక అప్పులు చేసి నష్టపోయారు.

గతంలో ఎన్నో ఇబ్బందులు

కొత్త జిల్లాలో చుక్కల భూములు 67 వేల ఎకరాలు ఉన్నట్లు జిల్లా యంత్రాంగం గుర్తించింది. సాగుదారుల్లో రైతులు, డాక్టర్లు, లాయర్లు, ఇంజినీర్లు, ఐఏఎస్ అధికారులు, ఉద్యోగులున్నారు. ఆ భూముల్లో సాగు, బీడు భూములున్నాయి. వాటిని సంబంధిత యజమానులు విక్రయించుకునే అవకాశం లేకుండాపోయింది. ఈ సమస్య పరిష్కారం కోసం అన్నదాతలైతే పనులు మానుకుని వీఆర్వోలు, తహసీల్దార్లు, ఆర్డీఓలు, జిల్లా అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం దక్కేది కాదు. చుక్కల భూములనే విషయం తెలియక ముందుగా అడ్వాన్స్ తీసుకుని మళ్లీ నగదు తిరిగి చెల్లించలేక నానా అవస్థలు పడిన రైతులున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ గతంలో ఆత్మకూరు నుంచి నెల్లూరు వరకు రైతులు పాదయాత్రలు చేసిన సందర్భాలున్నాయి. ప్రతి వారం సాగుదారులు కలెక్టరేట్‌కు రావడం.. జిల్లా అధికారులకు వినతిపత్రాలు అందజేయడం.. పరిష్కారం కోసం ఆశగా ఎదురు చూడడం.. పరిపాటిగా మారిపోయింది.

నేడు జిల్లాస్థాయిలోనే..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ముందుకు అడుగులు వేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చుక్కల భూముల సమస్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఒకప్పుడు ఈ సమస్యను పరిష్కరించాలంటే సీసీఎల్‌ఏ ప్రత్యేక చొరవ అవసరం. వీఆర్వో, ఆర్‌ఐ, డీటీ, తహసీల్దార్, ఆర్డీఓ, జేసీ, కలెక్టర్ వరకు ఫైల్ వెళ్లాలి. కలెక్టర్ పరిశీలించి ఫైల్‌ను సీసీఎల్‌ఏకు పంపించాలి. వారు చొరవ తీసుకుని పరిశీలించి ఓకే చేస్తేనే ఆన్‌లైన్‌లో చుక్కల భూములకు మోక్షం లభించేంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కలెక్టర్లకు ప్రత్యేక అధికారాలు ఇచ్చింది. ఈ నిర్ణయంతో జిల్లాస్థాయిలోనే సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయి.

జీఓ ప్రకారం

జిల్లాలోని 67 వేల ఎకరాల్లో 43 వేల ఎకరాల చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం చూపుతూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 163ని విడుదల చేసింది. మిగిలిన 24 వేల ఎకరాలకు సంబంధించి ప్రభుత్వ, అసైన్‌మెంట్, దేవాలయ తదితర భూములున్నాయి. కాగా ఎటువంటి సమస్యల్లేకుండా అన్ని పత్రాలు అందుబాటులో ఉంటే దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కొంతకాలం క్రితం కల్పించింది. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి చుక్కలను తొలగించి ఆన్‌లైన్‌లో యజమానుల పేర్లు నమోదు చేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంది. రెవెన్యూ అధికారులు వేల దరఖాస్తులను పరిశీలించి వాటికి శాశ్వత పరిష్కారం చూపారు. ఇదిలా ఉండగా సమస్య పరిష్కారం కాని వారు పూర్తి వివరాలతో సచివాలయాల ద్వారా మళ్లీ దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఇచ్చారు.

పాలాభిషేకం
చుక్కల భూముల సమస్య పరిష్కారం కావడంతో లబ్ధిదారులుగా ఉన్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జీఓ విడుదల చేసిన నేపథ్యంలో సంతోషంతో ఆదివారం నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మంత్రి కాకాణి సమక్షంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం, పుష్పాభిషేకం చేశారు.

మంత్రి కాకాణి చొరవ
ప్రత్యేక జీఓ విడుదలలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవ ఉంది. చుక్కల భూములను క్రమబద్ధీకరించి శాశ్వత హక్కులు కల్పించాలని ఆయన పలు మార్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యను పరిష్కరించాలని సీఎం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో ప్రత్యేక జీఓ విడుదలైంది.

ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది

జిల్లాలో చుక్కల భూముల సమస్యలు అధికంగా ఉన్నాయి. వాటి పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. జీఓ నంబర్ 163 వల్ల జిల్లాలో 43 వేల ఎకరాల చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం లభించింది. ఈనెలలో సీఎం జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన చేతుల మీదుగా లబ్ధిదారులకు పత్రాలు అందజేసేలా చర్యలు తీసుకుంటాం.

– కేవీఎన్ చక్రధర్‌బాబు, కలెక్టర్

మిగిలిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు


సమస్యలున్న భూములను పక్కనపెట్టాం. పూర్తిస్థాయిలో పత్రాలు ఉండి ఎటువంటి సమస్యలు లేని వాటిని మాత్రమే ప్రస్తుతం పరిష్కరించాం. మిగిలిన వాటి పరిష్కారానికి చొరవ తీసుకున్నాం. దరఖాస్తు చేసుకుంటే పూర్తిస్థాయిలో పరిశీలిస్తాం.

– ఆర్.కూర్మనాథ్, జేసీ

న్యూస్‌రీల్

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్‌లో మూడు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్ట్ ఇంజినీర్లు ఆదివారం తెలిపారు. ఇందులో భాగంగా ఒకటో యూనిట్లో 460 మెగావాట్లు, రెండో యూనిట్లో 425 మెగావాట్లు, మూడో యూనిట్లో 510 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోందని వెల్లడించారు.

సోమశిలలో 54.272 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 54.272 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 347 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. పెన్నార్ డెల్టాకు 1,200 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 403, దక్షిణకాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 97.075 మీటర్ల నీటి మట్టం నమోదైంది. సగటున 315 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వృథా అవుతోంది.

పదిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

పొదలకూరు: పది పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటయ్య అన్నారు. మండలంలోని మహ్మదాపురం బీసీ బాయ్స్ హాస్టల్ విద్యార్థులకు ఏపీ బీసీ విద్యార్థి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. మంచి మార్కులు తెచ్చుకుని హాస్టల్‌కు పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ బీసీ విద్యార్థి సంక్షేమ సంఘం రాయలసీమ అధ్యక్షుడు గంగోరు వాసుకుమార్, మస్తాన్‌గౌడ్, సంక్షేమాధికారులు శివకుమార్, దేవకుమార్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పెన్షన్ కానుకను సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఉదయం 11 గంటల నుంచి వలంటీర్లు 3,09,649 మంది లబ్ధిదారులకు రూ 86.29 కోట్ల నగదు పంపిణీని ప్రారంభించనున్నారు. ఈనెల 1, 2 తేదీల్లో బ్యాంక్‌లకు సెలవులు కావడంతో కానుకను మూడో తేదీ నుంచి అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మొదటిరోజే వందశాతం పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. లబ్ధిదారులు అందుబాటులో ఉండాలని అధికారులు కోరారు.

నేటి నుంచి 'పది' పరీక్షలు

- జిల్లాలో 172 సెంటర్లు
- ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ అధికారులు

నెల్లూరు(టౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 18వ తేదీ వరకు జరుగుతాయి. జిల్లా వ్యాప్తంగా 172 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు జిల్లా విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తితే 83414 08109 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు. అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుంటారు. జిల్లా పరిశీలకులుగా ఆర్జేడీ సుబ్బారావును నియమించారు. విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలని అధికారులు తెలిపారు. కేంద్రంలోకి 8.45 గంటలకు అనుమతించనున్నారు. ఎగ్జామ్స్ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయి. జిల్లా వ్యాప్తంగా 27,291 మంది రెగ్యులర్, 2,100 మంది ప్రైవేట్ విద్యార్థులున్నారు. గదిని బట్టి 20 నుంచి 24 మంది విద్యార్థులు ఉండే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎగ్జామ్ సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. ఏడు అతి సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు హాల్‌టికెట్ చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇన్విజిలేటర్లు సెల్‌ఫోన్లను బయటపెట్టి కేంద్రంలోకి వెళ్లాలని ఆదేశాలున్నాయి.


బుచ్చిరెడ్డిపాళెం: పదో తరగతి పరీక్షలు జరిగే డీఎల్‌ఎన్ఆర్ పాఠశాల

ఓపెన్ స్కూల్ పరీక్షలు కూడా..

సోమవారం నుంచి ఏపీ ఓపెన్ స్కూల్ ఎస్‌ఎస్‌సీ, ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఎస్‌ఎస్‌సీ కోసం 6, ఇంటర్ కోసం 16 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను పక్కాగా నిర్వహించేందుకు 4 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు.

ఆర్టీసీలో ఉచిత ప్రయాణం
నెల్లూరు(వీఆర్సీసెంటర్): పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. జిల్లాలో ఏ ప్రాంతం నుంచి అయినా విద్యార్థులు బస్సులో హాల్‌టికెట్ చూపించి పరీక్ష కేంద్రాలకు చేరుకోవచ్చు. పరీక్ష రాసిన తర్వాత కూడా ఇళ్లు, హాస్టళ్లకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించవచ్చు.

అదనంగా 30 బస్సులు

విద్యార్థుల కోసం అదనంగా 30 బస్సులను ఏర్పాటు చేశామని నెల్లూరు ఆర్టీసీ ఆర్‌ఎం పీవీ శేషయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచితంగా ప్రయాణించే అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రశాంతంగా రాయాలి
పదో తరగతి పరీక్షలను పక్కాగా నిర్వహిస్తాం. విద్యార్థుల కోసం కేంద్రాల్లో సౌకర్యాలను కల్పించాం. సమస్యలుంటే ఫోన్ చేసి చెప్పొచ్చు. తక్షణం పరిష్కరించేందుకు అధికారులను నియమించాం. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. ఆందోళన చెందకూడదు.

– గంగాభవాని, డీఈఓ

మహిళలకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం


పొదుపు మహిళలకు నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- ఆసరా చెక్కుల పంపిణీలో మంత్రి కాకాణి

మనుబోలు: 'వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళలకు అండగా ఉంది. వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అన్ని చర్యలు తీసుకుంది.' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ ఆసరా 3వ విడత నిధులకు సంబంధించిన నమూనా చెక్కును స్థానిక సీపీఆర్ కల్యాణ మండపంలో ఆదివారం మంత్రి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకం 3వ విడతకు సంబంధించి మనుబోలు మండలంలో 603 గ్రూపులకు రూ.4.28 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో పొదుపు సంఘాలకు నిధులు కేటాయించడం గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అడ్రస్ లేని వ్యక్తి సోమిరెడ్డి

వెంకటాచలం: ఎన్నికల్లో వరుసగా నాలుగుసార్లు ఓటమిపాలైన సోమిరెడ్డి తనకంటూ అడ్రస్ లేని వ్యక్తిగా మిగిలాడని మంత్రి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. వెంకటాచలం మండలంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ తాను మాట్లాడే భాష గురించి పలు మార్లు అభ్యంతరం వ్యక్తం చేసిన సోమిరెడ్డి ప్రభుత్వ ఉద్యోగులపై మాట్లాడిన భాష సరైనదా అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రమోహన్‌రెడ్డి ఉద్యోగులను బెదిరించి అక్రమాలు, అవినీతికి పాల్పడ్డాడని విమర్శించారు. ఆయన ఇప్పుడు అధికారులు తన మాట వినడం లేదని ఇష్టారాజ్యంగా మాట్లాడటం మంచిపద్ధతి కాదన్నారు. సోమిరెడ్డి ఉడత బెదిరింపులకు భయపడేవారు ఎవరూ లేరనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు.

రోడ్డెక్కి.. పరువు పోగొట్టుకుని..


వింజమూరులో చంద్రశేఖర్‌రెడ్డి దిష్టిబొమ్మను ఊరేగిస్తున్న నాయకులు (ఫైల్)

- టీడీపీ ట్రాప్‌లో ఉదయగిరి ఎమ్మెల్యే
- ఉత్తుత్తి సవాళ్లు విసిరిన చంద్రశేఖర్‌రెడ్డి
- వైఎస్సార్‌సీపీ ప్రతిసవాల్‌తో తోకముడిచిన వైనం
- ఎమ్మెల్యే తీరుపై ప్రజల ఆగ్రహం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి టీడీపీ ఉచ్చులో చిక్కుకున్నారు. ఆయనకు టికెట్ ఆశ చూపి వైఎస్సార్‌సీపీపై ఉసిగొల్పారు. చంద్రశేఖర్‌రెడ్డి రెండురోజులపాటు ఉదయగిరిలో వైఎస్సార్‌సీపీ నేతలపై ఉత్తుత్తి సవాళ్లతో వేడెక్కించారు. పార్టీ నేతలు ఎమ్మెల్యే సవాల్‌ను స్వీకరించి ప్రతి సవాల్ చేయడంతో ఆయన అనారోగ్యం సాకుచూపి తోకముడిచారు. ఓటుకు నోటుతో పరువు పోగొట్టుకున్న ఎమ్మెల్యే ఉదయగిరిలో చిల్లర రాజకీయాలు చేస్తూ వీధికెక్కడంపై స్థానికంగా జనాగ్రహం వెల్లువెత్తుతోంది.

అన్న అండతో..

తన సోదరుడు, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి బ్రాండ్ ఇమేజ్‌తో చంద్రశేఖర్‌రెడ్డి రాజకీయాల్లోకి వచ్చారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి 1999లో ఆయనకు కాంగ్రెస్ తరఫున ఉదయగిరి టికెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో ఓటమి చెందినా 2004, 2009 ఎన్నికల్లో గెలుపొంది వైఎస్సార్ కుటుంబానికి మరింత చేరువయ్యారు. 2009లో వైఎస్సార్ మరణానంతరం జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో మేకపాటి కుటుంబమంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడిచింది. 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచారు. 2014లో ఉదయగిరి నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసి ఓటమి చెందారు. 2019లో ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన ముఖ్యనేతలు చంద్రశేఖర్‌రెడ్డికి టికెట్ ఇవ్వొద్దని వినతిపత్రం ఇచ్చినా జగన్‌మోహన్‌రెడ్డి వారికి నచ్చజెప్పారు.

మారిన వ్యవహారశైలి

చంద్రశేఖర్‌రెడ్డి తీరుపై నియోజకవర్గంలోని నాయకులు పలుమార్లు అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. పార్టీ పరిశీలకులు సైతం ఎమ్మెల్యే దండకాలపై నివేదిక తయారు చేసి అధిష్టానానికి పంపారు. ఎమ్మెల్యే గ్రాఫ్ తగ్గిందని పలుమార్లు పార్టీ పెద్దలు హెచ్చరించినా ఆయన తీరు మార్చుకోలేదు. వచ్చే ఎన్నికల్లో టికెట్ రాదని తెలుసుకున్న చంద్రశేఖర్‌రెడ్డి టీడీపీ నేతల ట్రాప్‌లో పడ్డారు.

గతంలో ఇదే సీన్

2007లో జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి పార్టీకి కాంగ్రెస్ పార్టీకి ద్రోహం తలపెట్టి సస్పెన్షన్‌కు గురయ్యారు. అప్పట్లో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సీవీ శేషారెడ్డికి అవకాశం కల్పించి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కానీ చంద్రశేఖర్‌రెడ్డి ఇండిపెండెంట్ అభ్యర్థి బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి విజయానికి సహకరించడంతో కాంగ్రెస్ పార్టీ దీనిపై అంతర్గత దర్యాప్తు చేసి ఆయన్ని సస్పెండ్ చేసింది. ఈ ఏడాది ఎమ్మెల్సీ ఎన్నికల్లో చంద్రశేఖర్‌రెడ్డి టీడీపీకి అమ్ముడుపోయి వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్‌గా నిలిచారు.

రెచ్చగొట్టేలా..

చంద్రశేఖర్‌రెడ్డిని టీడీపీ పావుగా వాడుకుంటోంది. ఎమ్మెల్యే చేత రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయిస్తూ ఆయన వీధినపడేలా చేస్తోంది. కాగా చంద్రశేఖర్‌రెడ్డి తన కుటుంబంతోపాటు వైఎస్సార్‌సీపీపై నిందారోపణలు చేయడంపై నాయకులు మండిపడుతున్నారు. ఉదయగిరిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులను రెచ్చగొట్టేలా ఇటీవల ఎమ్మెల్యే సవాళ్లు విసిరారు. ఉదయగిరి మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి, మరోనేత మూలే వినయ్‌కుమార్‌రెడ్డి స్పందించి ప్రతి సవాల్ విసిరారు. నేతల సారథ్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఉదయగిరిలో భారీగా ర్యాలీలు నిర్వహించారు. పార్టీకి ద్రోహం తలపెట్టిన చంద్రశేఖర్‌రెడ్డిని అడ్డుకుంటామని హెచ్చరించారు. సుబ్బారెడ్డి స్వయంగా ఎమ్మెల్యేకు ఫోన్ చేసి సవాల్‌ను స్వీకరిస్తున్నానని చెప్పగా వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆగ్రహ జ్వాలలకు భయపడిన ఆయన అనారోగ్యం సాకు చూపి హైడ్రామా నడిపారు.

క్లుప్తంగా

ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ



లేఅవుట్‌లో ఆవిష్కరించిన శివాజీ విగ్రహం

బుచ్చిరెడ్డిపాళెం: ఛత్రపతి శివాజీ వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని రేబాలలో ఉన్న వర్మ్యాస భవిష్యనిధి లేఅవుట్‌లో ఆదివారం ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వర్మ్యాస అధినేత వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ చరిత్రలో నిలిచిపోయిన వీరుడని, ఆ మహనీయుని విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.80
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.40

వైభవంగా శ్రీహనుమ భక్త శోభాయాత్ర

- హనుమంతుని జీవితం యువతకు స్ఫూర్తిదాయకం
- నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్



శోభాయాత్రలో ఉత్సాహంగా ముందుకుసాగుతున్న యువత



శోభాయాత్రను ప్రారంభిస్తున్న నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్



పోలీసు సిబ్బందికి మైక్‌లో సూచనలిస్తున్న ఎస్పీ విజయారావు

నెల్లూరు(బృందావనం): దేశరక్షణ, ధర్మపరిరక్షణను కాంక్షిస్తూ హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో నగరంలో ఆదివారం చేపట్టిన శ్రీహనుమ భక్త శోభాయాత్ర వైభవంగా సాగింది. శోభాయాత్రను ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద నుడా చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ కాషాయ జెండా ఊపి ప్రారంభించారు. హనుమాన్‌ను స్మరిస్తూ చేపట్టిన శోభాయాత్రలో సుమారు 10 వేల మందికి పైగా యువత ద్విచక్ర వాహనాల్లో పాల్గొన్నారు. ర్యాలీలో యువతీ యువకులు, మహిళలు ప్రత్యేక ఆకర్షణగా పగిడీలను ధరించి ద్విచక్ర వాహనాలపై కాషాయ పతాకాలను రెపరెపలాడిస్తూ జై శ్రీరామ్.. జైజై హనుమాన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ముందుకుసాగారు. దేశభక్తి, హనుమత్‌శక్తిని చాటే గీతాలతో డీజేసౌండ్‌ల నడుమ శోభాయాత్ర సాగింది. ఈ సందర్భంగా ద్వారకానాథ్ మాట్లాడుతూ శ్రీరామ భక్తుడు, కార్యసాధకుడు అయిన హనుమంతుని జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఎన్నో విజయాలను సొంతం చేసుకున్న హనుమంతుని కీర్తి ఎనలేనిదన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

దేశభక్తిని ప్రతిబింబిస్తూ సాగిన శోభాయాత్ర ఏసీ స్టేడియం నుంచి కేవీఆర్ పెట్రోల్ బంక్, శ్రీసర్వోదయ కళాశాల, జిల్లా కోర్టు, మద్రాస్ బస్టాండ్ సెంటర్, వీఆర్సీ సెంటర్, గాంధీబొమ్మ, శివాజీ సెంటర్, ఏసీ సెంటర్, కనకమహల్ సెంటర్, బోసుబొమ్మ, ఆత్మకూరు బస్టాండ్, స్టోన్‌హౌస్‌పేట మీదుగా ఆర్ఎస్ఆర్ఎం ఉన్నత పాఠశాల వద్దకు చేరుకుంది. ఈ శోభాయాత్రలో బీజేపీ నాయకులు భరత్‌కుమార్, వాకాటి నారాయణరెడ్డి, ఆంజనేయులురెడ్డి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వల్ప ఉద్రిక్తత

శోభాయాత్ర మద్రాస్ బస్టాండ్ వద్దకు చేరుకుంటున్న సమయంలో మార్గమధ్యంలో జిల్లా కోర్టు వద్దకు రాగానే ఒక వర్గానికి చెందిన యువకులు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అందుకు ప్రతిగా శోభాయాత్రలో ఉన్న యువత ప్రతినినాదాలు చేశారు. దీంతో ఆ ప్రాంతంలో కొంత గందరగోళం నెలకొంది. పరిస్థితి చేయి దాటకముందే ఎస్పీ విజయారావు తన సిబ్బందితో అక్కడికి చేరుకుని ఇరువర్గాలను నియంత్రించారు. దీంతో శోభాయాత్ర సాఫీగా సాగింది.

పటిష్ట బందోబస్తు మధ్య శోభాయాత్ర

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలో ఆదివారం నిర్వహించిన శ్రీహనుమ భక్త శోభాయాత్ర పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిసిందని ఎస్పీ విజయారావు ఆదివారం రాత్రి తెలిపారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నుంచి నవాబుపేట వరకు నిర్వహించిన శోభాయాత్రను కమాండ్ కంట్రోల్ రూంలో సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తూ అధికారులకు తగు సూచనలు చేసినట్లు తెలిపారు. గతంలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా శోభాయాత్ర సున్నిత ప్రాంతానికి వచ్చే సమయానికి తాను అక్కడికి చేరుకొని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా శోభాయాత్ర ముగిసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఏఎస్పీ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 118
లేయర్ (లైవ్)	: 75
బ్రాయిలర్ చికెన్	: 210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 230
లేయర్ చికెన్	: 128

రెడ్‌క్రాస్‌లో ఎన్నికల కోలాహలం

- 15 పదవులకు 34 మంది పోటీ
- 56 శాతం పోలింగ్ నమోదు



తమ పేర్లను సరిచూసుకుంటున్న ఓటర్లు

నెల్లూరు(అర్బన్) : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నెల్లూరు జిల్లా కమిటీ ఎన్నికలు నగరంలోని మద్రాస్ బస్టాండ్ సమీపంలో ఉన్న ఆ సంస్థ కార్యాలయంలో ఆదివారం కోలాహలంగా జరిగాయి. 15 మంది మేనేజింగ్ కమిటీ సభ్యుల పదవుల కోసం 34 మంది పోటీలో నిలిచారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పక్షాన గునుపాటి ప్రసాద్‌రెడ్డి, సుధీర్‌నాయుడు, బయ్యా ప్రసాద్, మలిరెడ్డి కోటారెడ్డి, వై.రంగయ్యానాయుడు, సురేష్‌కుమార్ తదితర 15 మంది సేవా ప్యానెల్ పేరుతో పోటీకి దిగారు. మిగతా 19 మంది ఎలాంటి ప్యానెల్ లేకుండా స్వతంత్రులుగానే పోటీ చేశారు. గత ఫిబ్రవరి వరకు రెడ్‌క్రాస్ చైర్మన్‌గా ఉన్న చంద్రశేఖర్‌రెడ్డి రెండోదఫా పోటీలో నిలిచారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రహస్య బ్యాలెట్ పద్ధతిన పోలింగ్ జరిగింది. భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎన్నికల అధికారి, డీసీఓ తిరుపాలురెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పోలింగ్ తీరును ఆర్డీఓ మలోల తదితరులు పర్యవేక్షించారు.

ఓట్లు గల్లంతయ్యాయంటూ వాగ్వాదం

నెల్లూరు మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, జర్నలిస్టు దయాశంకర్ లాంటి కొందరు తాము ఓటేసేందుకు వస్తే ఓట్లు లేవనడం సరికాదంటూ వాదనకు దిగారు. తిరుపాల్‌రెడ్డితో మాట్లాడుతుండగా అంతలో ఎన్నికల పరిశీలనకు వచ్చిన ఆర్డీఓ మలోలతో భానుశ్రీ వాగ్వాదానికి దిగారు. రెడ్‌క్రాస్ సెక్రటరీ వద్దకు వెళ్లి తమ పేర్లు లైఫ్ మెంబర్ జాబితాలో ఉన్నాయని సర్టిఫికెట్ తెచ్చారు. సర్టిఫికెట్‌ను చూపి ఓటివ్వాలని ఆందోళన చేశారు. ఎన్నికల అధికారి మాత్రం ఓటర్ జాబితాలో ఉంటేనే అనుమతిస్తామన్నారు. అనంతరం భానుశ్రీ మాట్లాడుతూ తమ ఓట్లు గల్లంతుపై కోర్టుకు వెళ్తామని ప్రకటించి వెళ్లారు.

7,138 ఓట్లకు పోలైనవి – 4001

జిల్లాలో ఓటర్ జాబితా ప్రకారం 7,138 రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యులు ఓటర్లుగా ఉన్నారు. వీరికోసం నెల్లూరులో 15 పోలింగ్ బూత్‌లను, కావలిలో 7 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. నెల్లూరులో 2,961 ఓట్లు, కావలిలో 1,040 ఓట్లు కలిపి మొత్తం 4,001 ఓట్లు పోలయ్యాయి. 56 శాతం ఓటింగ్ నమోదైంది.

ఆత్మకూరు బ్రాంచ్‌లో 100 ఓట్లు గల్లంతు

ఆత్మకూరు రెడ్‌క్రాస్ సబ్‌బ్రాంచ్ తరఫున పలువురు ఓటింగ్ కోసం నెల్లూరుకు వచ్చారు. అయితే ఓట్లు లేవని అనుమతించలేదు. దీంతో ఆత్మకూరు రెడ్‌క్రాస్ జీవిత సభ్యులైన లక్కు ప్రసాద్, నాగయ్య, లక్ష్మీపతి తదితరులు మాట్లాడుతూ ఆత్మకూరులో 256 ఓట్లు ఉన్నాయన్నారు. వాటిలో ఇక్కడ 100 ఓట్లు తీసేశారని మరో మారు ఎన్నికల అధికారితో వాదనకు దిగారు. ఈ విషయమై రెడ్‌క్రాస్ అధికారులు వివరణ ఇస్తూ ఓట్లు అప్‌లోడ్ చేసేటప్పుడు మిస్ అయి ఉండొచ్చన్నారు.

ఓటేసిన అంతర్జాతీయ స్విమ్మర్ శ్యామల

తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటకు చెందిన గోలి శ్యామల అంతర్జాతీయ స్విమ్మర్. శ్రీలంక నుంచి ఇండియాకు సముద్రంలో 30 కిలోమీటర్లు స్విమ్మింగ్ చేసి అంతర్జాతీయంగా ఖ్యాతి గడించారు. కాగా ఆమె హైదరాబాద్ నుంచి నెల్లూరుకు వచ్చి ఓటేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతేడాది రెడ్‌క్రాస్ కమిటీ తనను నెల్లూరులో సన్మానించిందన్నారు. ఇక్కడి సేవలను చూసి నెల్లూరు రెడ్‌క్రాస్ జీవిత కాల సభ్యురాలిగా సభ్యత్వం తీసుకున్నానన్నారు. వచ్చే సెప్టెంబర్‌లో 50 కిలోమీటర్లు స్విమ్ చేసి దేశానికి అవార్డు తీసుకొస్తానని ప్రకటించారు.

కౌంటింగ్ వాయిదా..

ఈ ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ సోమవారం జరగాల్సి ఉండగా వాయిదా వేస్తూ ఎన్నికల అధికారి నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికలకు సంబంధించి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలై ఉన్నందున తుది తీర్పు వెలువడిన తర్వాత ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ చేపట్టనున్నారు.

కావలిలో కూడా పోలింగ్

జిల్లాలోని ప్రాంతాలను రెండు భాగాలుగా విభజించారు. నెల్లూరు, ఆత్మకూరు, చేజర్ల, కలువాయి, కొడవలూరు, మర్రిపాడు, ఉదయగిరి, విడవలూరు రెడ్‌క్రాస్ సబ్ బ్రాంచ్‌లకు సంబంధించిన ఓటర్ల కోసం నెల్లూరు రెడ్‌క్రాస్ కార్యాలయంలో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. కావలి, బోగోలు, దుత్తలూరు, కలిగిరి, కందుకూరు, కొండాపురం, వింజమూరు బ్రాంచ్‌లలో సభ్యత్వం కలిగిన వారికి కావలి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద ఉన్న రెడ్‌క్రాస్ కార్యాలయంలో పోలింగ్ నిర్వహించారు.

ప్రశాంతంగా జరిగాయి

రెడ్‌క్రాస్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పోలైన ఓట్లను బూత్‌ల వారీగా సీల్ చేసి స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరిచాం. తనకు ఇచ్చిన జాబితా ప్రకారం పోలింగ్ నిర్వహించాను.

– తిరుపాల్‌రెడ్డి, ఎన్నికల అధికారి



అధికారులతో మాట్లాడుతున్న మాజీ మేయర్ భానుశ్రీ



ఓటరుకు బ్యాలెట్ పేపర్ అందజేస్తున్న ఎన్నికల సిబ్బంది



ఓటేసి సిరా గుర్తును చూపుతున్న అంతర్జాతీయ స్విమ్మర్

సముద్రంలో యువకుడి గల్లంతు

- కరేడు బీచ్ సమీపంలో ఘటన



జాలమహేష్(ఫైల్)

ఉలవపాడు: సముద్రంలో యువకుడు గల్లంతైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. ప్రకాశం జిల్లా సింగరాయకొండలోని ఇస్లాంపేటకు చెందిన ఉమ్మడిశెట్టి జాలమహేష్ (23) విజయవాడలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగం సాధించాడు. ఈ విషయం తన మిత్రులకు తెలియజేసి ఆదివారం పార్టీ ఇస్తానని చెప్పి విజయవాడ నుంచి సింగరాయకొండకు వచ్చాడు. 9 మంది మిత్రులతో కలిసి కరేడు బీచ్ నుంచి కిలోమీటర్ నడుచుకుంటూ మన్నేరు – సముద్రం కలిసే వద్దకు వెళ్లి అందరూ క్రికెట్ ఆడుతున్నారు. బాల్ సముద్రంలో పడడంతో ఇద్దరు బాల్ తీసుకురావడానికి వెళ్లారు. ఈ సమయంలో జాలమహేష్ లోపలికి వెళ్లిపోయాడు. అక్కడే ఉన్న మత్స్యకారులు మరో యువకుడిని కాపాడారు. జాలమహేష్ మాత్రం గల్లంతయ్యాడు. మెరైన్ పోలీసులు వచ్చి గాలించినా కనిపించలేదు. గల్లంతైన విద్యార్థికి తల్లిదండ్రులు ఇద్దరూ లేరు. బాబాయ్ వద్ద తన చెల్లెలితో కలిసి ఉంటున్నాడు. తండ్రి రమేష్ గుండెపోటుతో, తల్లి విజయ ఆరోగ్యం బాగాలేక నాలుగేళ్ల క్రితమే మరణించారు. చెల్లెలు డిగ్రీ చదువుతోంది. తను ఉద్యోగానికి ఎంపిక కావడంతో చెల్లికి అండగా ఉండాలనుకున్న సమయంలో ఈ ఘటన జరిగింది. మత్స్యకారులు, మెరైన్ సిబ్బంది జాలమహేష్ కోసం గాలిస్తున్నారు.

నెల్లూరుకు వందే భారత్



వందే భారత్ రైలు



రైలు లోపలి భాగం

- సూపర్ స్పీడ్‌తో ప్రయాణం
- ఈ నెల 9 నుంచి రెగ్యులర్ సర్వీసులు
- ట్రాక్‌పై 110 నుంచి 130 కిలోమీటర్ల వేగంతో పరుగులు

నెల్లూరు(సెంట్రల్): భారత రైల్వే సంస్థ ఎంతో ప్రతిష్టాత్మకంగా నడుపుతున్న వందే భారత్ రైలు నెల్లూరు మీదుగా ప్రయాణించనుంది. తక్కువ సమయంలోనే గమ్యానికి చేరేలా ఈ రైలు సూపర్ స్పీడ్‌తో పట్టాలపై పరుగులు తీయనుంది. కాగా ఈ రైలులో ఒక్క సారైనా ప్రయాణించాలని ప్రయాణికులు ఉత్సాహం చూపుతున్నారు. కాగా రైల్వే అధికారులు తీసుకున్న నిర్ణయం మేరకు వందే భారత్ రైలు నెల్లూరు రైల్వేస్టేషన్‌లో ఆగనుంది.

9 నుంచి రెగ్యులర్ సర్వీసులు

ఈ నెల 8వ తేదీన ప్రధాని నరేంద్రమోదీ చేతులమీదుగా సికింద్రాబాద్‌లో వందే భారత్ రైలు ప్రారంభం కానుంది. ఈ రైలు నేరుగా తిరుపతి రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుంది. ఎక్కడా ప్రయాణికులకు అందుబాటులో ఉండదు. అయితే ఈ రైలు 9వ తేదీన తిరుపతి నుంచి ప్రయాణికులకు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఈ రైలు 10వ తేదీ నుంచి ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది.

130 కి.మీ. స్పీడ్‌కు అనుమతులు

సాధారణంగా ప్రస్తుతం ఉన్న అన్ని సూపర్‌ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు కేవలం 70 నుంచి 100 కిలోమీటర్ల లోపు వేగంతో ప్రయాణిస్తాయి. అయితే వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు మాత్రం 110 నుంచి 130 కిలోమీటర్ల వరకు స్పీడ్ కెపాసిటీ అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో 110 కి.మీ. వేగంతో, ట్రాక్ ఇబ్బందులు లేనిచోట్ల 130 కి.మీ. వేగంతో ప్రయాణించే అవకాశాలు ఉన్నాయి.

8 కోచ్‌లు మాత్రమే

ప్రస్తుతం తిరుగుతున్న ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో అన్నీ కలిపి 23 కోచ్‌లు ఉంటాయి. కానీ వందే భారత్ రైలు సూపర్ స్పీడ్‌తో ప్రయాణించనుండడంతో కేవలం 8 ఏసీ కోచ్‌లకు మాత్రమే అనుమతి ఇచ్చారు. పరిస్థితిని బట్టి మరికొన్ని రోజుల్లో కోచ్‌లు పెంచే యోచనలో రైల్వే అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.

ఈ సమయాల్లో..

సికింద్రాబాద్ – తిరుపతి(20701) వందే భారత్ రైలు ఉదయం 6 గంటలకు ప్రారంభమై నెల్లూరుకు మధ్యాహ్నం 12.30 గంటలకు, తిరుపతికి మధ్యాహ్నం 2.30 గంటలకు చేరుకుంటుంది. అలాగే తిరుపతి – సికింద్రాబాద్(20702) వందే భారత్ రైలు మధ్యాహ్నం 3.15 గంటలకు ప్రారంభమై నెల్లూరుకు సాయంత్రం 5.20 గంటలకు, సికింద్రాబాద్‌కు రాత్రి 11.45 గంటలకు చేరుకుంటుంది.

దాడులు చేస్తే కఠిన చర్యలు



ఎంతో ప్రతిష్టాత్మకంగా నడుపుతున్న వందే భారత్ రైల్లో ప్రయాణికులు కూడా ఉత్సాహంగా ఎక్కుతున్నారు. కాగా కొంతమంది ఇటీవల ఈ రైలుపై దాడులు చేశారు. వివిధ చోట్ల దాడులు చేసిన 39 మందిని ఇటీవల అరెస్ట్ చేశాం. అలాంటివి జరిగితే రైల్వే చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.

– శివేంద్ర మోహన్, డీఆర్ఎం, విజయవాడ డివిజన్